# తండ్రులూ జాగ్రత్త!

షీలా శివరాం




కమలమ్మ చాకలి బట్టల పద్దు లెఖ్ఖ జూసి,

'రేపు రారా సింగయ్యా! ఇప్పుడు అయ్యగారు ఇంట్లో లేరు. రేపొద్దున్నే వచ్చి డబ్బు పట్టుకుపో' అనడం వినిపించిన సురేష్ పేపర్ లోంచి తల తిప్పి చూశాడు.

'అమ్మా నా పర్సులో డబ్బుంది. పది రూపాయలు మార్చి ఇవ్వు' అన్నాడు.

అత నూహించినట్లుగానే కమలమ్మ చాకలికి డబ్బు లెఖ్ఖజూసి ఇచ్చి పంపేసిన తరువాత సురేష్ దగ్గరగా వచ్చింది. చేతిలోని ఫోటోని సురేష్‌కి చూపిస్తూ 'ఎవర్రా ఈ అమ్మాయీ ?' అంది.

తలెత్తిచూసిన సురేష్ ఫోటో చూసి కంగారుపడినట్టుగా 'ఎక్కడిది?' అన్నాడు ఎదురు ప్రశ్నగా.

'నీ పర్సులో వున్నదే గదుర్రా!ఎవరీ అమ్మాయి ?' అందావిడ సందేహాలన్నీ కలగలిపి కంఠంలో పలికిస్తూ.

సురేష్ పేపరు చాటునుంచి తల్లి ముఖాన్ని పరీక్షగా చూశాడు. ఆవిడ ఫొటోలోని పిల్లని పరీక్షగా చూస్తోంది.

సురేష్ పేపరు పక్కకి తప్పించి, తల్లి చేతిలోని ఫోటోని ఓసారి చూసినట్లుగా చూసి 'ఓ, ఇదా......' అంటూ ఆగాడు.

కమలమ్మ తలతిప్పి చూసింది కొడుకు చెప్పబోయే మాటలు వినటానికన్నట్లుగా.

'రేణు అని ఓ ఫ్రెండులే' అంటూ తిరిగి పేపర్లో తలదూర్చాడు.

కమలమ్మ ఎర్రబడ్డ కొడుకు ముఖాన్ని, ఆ కంగారుని చూసి కేసుని కరెక్ట్‌గా డయాగ్నయిజ్ చేసింది.

'ఎవరమ్మాయి?' అంది కుతూహలంగా.

'రంగారావు గారని, రిటైర్డ్ పోలీసు ఆఫీసరు లే' అన్నాడు సురేష్.

'ఎవరూ? '

'ఈ వూళ్ళోనే ఉంటున్నారు.'

'ఎక్కడ ? నీ కెలా పరిచయం అయింది?' అందావిడ ఆత్రుతగా.

'ఎప్పుడో పరిచయం అయిందిలే, అన్నాడు రవంత విసుగు నటిస్తూ. కమలమ్మ మరోసారి కొడుకుని, ఫోటోని మార్చి మార్చి చూసింది.

ఫోటోలోని పిల్ల రెండుజడలతో,నవ్వే కళ్ళతో, కోలమొహంతోచూడముచ్చటగా వుంది. ఆవిడ దృష్టిని, ముఖ్యంగా ఫోటో కిందుగా గుండ్రటి అక్షరాల్లో రాసిన ఇంగ్లీషు మాటలు ఆకర్షించాయి. ఆవిడ కూడపలుక్కుంటూ చదివింది. 'విత్ లవ్ ఫ్రమ్ రేణు' అని రాసుంది. ఆవిడ మనసులో మిగిలివున్న అనుమానం కాస్తా తీరిపోయింది.

'పెళ్ళయిందా ఈ అమ్మాయికి? అందావిడ ఏమీ తెలియనట్లుగా.

'లేదు. ఏమిటమ్మా యక్ష ప్రశ్నలు వేస్తావు. ఇలాతే' అంటూ ఫోటోకోసం చెయిజాపాడు. ఆవిడ ఫోటోని సురేష్ చేతికి ఇవ్వలేదు. అది పుచ్చుకుని లోపలివైపు వెళ్ళింది. సురేష్ నవ్వుకున్నాడు.

'నా పర్సులో పెట్టేయ్' అంటూ వెనకనించి కేకేశాడు. ఆవిడ పర్సులో పెట్టదని తెలుసు. రెండురోజులుగా తను తల్లిదండ్రులతో చెప్పలేకపోతున్న సమస్య తీరిపోయినందుకు 'హమ్మయ్య' అనుకున్నాడు అసలందుకే పర్సుతీసి డబ్బు తీసుకోమంది. రెండురోజుల్నించి తండ్రి తనను వూదరకొట్టేస్తున్నాడు. శేషయ్యగారమ్మాయిని ఇస్తామన్నార్రా. పదివేలు ఇస్తామంటున్నారు. విశ్వేశ్వ్రరావుగారు కూడా ఖబురు చేశాడు. పదిహేను వేలవరకు పెడతాడట. మా అబ్బాయిని అడిగి చెప్తానన్నాను' అంటూ.

కొడుకు అమెరికా వెళ్ళేలోగా పెళ్ళి చేసెయ్యాలని ఆయన తాపత్రయం. పైగా ఆయనకి తెలిసినవాళ్ళంతా కొడుకు డాక్టరై అమెరికా వెడుతున్నందుకు అభినందిస్తూ, 'ముక్కుకి తాడుపోసి మరీ పంపండి అనంతయ్య గారూ, ఎందుకైనా మంచిది. అక్కడికి వెళ్ళాక ఏం జరిగిందీ ఎవరు చూడొచ్చారు' అంటూ ఓ అయాచిత సలహాని కూడా జోడిస్తూ వచ్చారు. అమెరికా వెళ్ళి చెయ్యబోతాడేమో అనుకునే చెడ్డపన్లన్నిటికీ ఆ ముక్కుదాడు ఓ రక్షా బంధం అయినట్టుగా.

అనంతయ్యగారి ఉద్దేశ్యంకూడా అదే. అసలాయనకి డాక్టరయ్యాడు అంటేనే ఏదో కలలోలాగా వుంది. తను వొట్టి కలెక్టరాఫీసులో గుమాస్తా. దానికితోడు ముక్కుసూటిగా పోయేరకం. బల్లక్రింద నించి చేతులుపెట్టే జాతికి ఆయన ఆమడ దూరంలో వుంటారు. తాతలు కట్టించిన ఓ పెంకుటిల్లు, ఓ కొడుకూ, కూతురు, భార్య కమలమ్మ తనగుమాస్తా గిరీ, ఇవే ఆయనకున్న ఆస్తులన్నీ. ఆయన కొడుకుమీద ఏనాడూ బ్రహ్మాండమయిన ఆశలు పెట్టుకోలేదు. వాడి పొట్ట వాడు పోసుకునే చదువుంది, వుద్యోగం దొరికితే, చాలనుకునేవారు. కానీ సురేష్ నిప్పురవ్వలాటివాడు. ప్రతి ఏడాది ఫస్టు మార్కులతో పాసయ్యేవాడు. టీచర్లంతా కొడుకు తెలివితేటల్ని మెచ్చుకుంటూవుంటే ఆయన సంతోష పడేవారు. కొడుకు ఇంటరు ఫస్టు క్లాసులో పాసయినప్పుడు మరింత సంతోషాన్ని అనుభవించాడు. 'నాన్నా నేను మెడిసిన్‌కు ఎప్లై చేస్తానన్నప్పుడు ఆయన వుప్పొంగే సంతోషంమీద నీళ్ళు చల్లినట్లయింది. అంత ఖరీదు చదువులు తనెలా భరించగలడు? అదే మాటన్నాడు కొడుకుతో. సురేష్ చిన్నబుచ్చు కోలేదు. అసలు సీటు దొరకటం చాలా కష్టం నాన్నా. దొరికినప్పటి సంగతి గదా. దొరక్కపోతే బి.ఎస్సీ వుండనే వుందిగదా అన్నాడు.

కొడుక్కి ఎం.బి. లో సీటు రాదనే ఆయన గట్టి నమ్మకం. ఆ సీటుకోసం ముప్పై నలభై వేలు డొనేషన్ కట్టే వాళ్ళని, మినిస్టర్ల దగ్గర్నుంచి రికమండేషన్ తెచ్చుకునే వాళ్లని అనేక మందిని చూశారు. అందుచేత ఏ డబ్బూ, ఏ రికమండేషన్లు లేని కొడుక్కి సీటు దొరకదని గట్టిగా దృఢపర్చుకున్న తరువాతే ఆయన కొడుకుచేత దానికి కావాల్సిన ప్రయత్నాలన్నీ చేయించారు. కొడుకుని నిరాశ పర్చటం ఆయనకి సుతరామూ ఇష్టం లేదు. కొడుక్కి మెరిట్ మీద సీటు దొరికిందని విన్నప్పుడు ఆయనకి ఆనందించాలో, విచారపడాలో తెలియకుండా పోయింది : తన కొడుకు అప్పుడే డాక్టరయి పోయినట్లుగా నలుగురూ అభినందిస్తుంటే ఆయనకి వుక్కిరి బిక్కిరి అయినట్లు వుండేది.

'మీవాడు అదృష్ట జాతకుడయ్యా. ఇంకా సందేహిస్తావేమిటి? రెక్కలు కట్టుకునిపోయి జేరిపొమ్మను'అన్నారంతా కానీ ఆయన రెక్కలకంత శక్తి వుందో లేదో ఎవ్వరూ ఆలోచించలేదు.

చివరకు సురేష్ ఎం.బి లో జేరనూ జేరాడు. చదువు ముగించి డిగ్రీ పుచ్చుకోవటమూ అయింది. మరేవో పరీక్షలు పాసయి అమెరికా వెళ్ళే అవకాశాన్ని కూడా గెల్చుకున్నాడు అప్పటివరకు అనంతయ్యగారు కాస్తోకూస్తో కూడబెట్టిందంతా కరిగిపోయింది. తన ప్రావిడెంటు ఫండులో లోన్ తీసుకోవటము అయించి. ఇంటిమీద పదివేల అప్పు వుంది. పెళ్ళికెదిగిన కూతురూ వుంది. అదృష్టదేవత కరుణించగా, కలిసొచ్చిన అవకాశాల్ని అందిపుచ్చుకొని పైకొచ్చిన కొడుకునిచూసి ఆనందంతో తలమునకలవుతున్నా, ఈ అప్పులూ, ఋణాలు

ఏలా తీర్చాలా అన్న ఆవేదన కూడా కృంగతీస్తూనే వుంది ఆయన్ని.

కమలమ్మ కొడుకు ప్రేమ సంగతి అనంతయ్యగారి చెవిన వేసినప్పుడు ఆయన తాపీగానే విన్నారు. ఆవిడ చూపించిన ఫోటో కూడా చూశారు. పిల్ల లక్షణంగానే వుందనిపించింది.

'ఈ వూరేట' అందావిడ. 'ఊహు' అన్నారు.

రంగారావుగారని రిటైరయిన పోలీ సాఫీసర్ట, మీకు తెలుసా?' అందావిడ.

అనంతయ్యగారు గజం ఎత్తున ఎగిరి పడ్డారు. ఆయనకి పోలీసు జాతంటే కాళ్ళు వొణుకుతాయి. వొళ్ళు కంపరంగా వుంటుంది. వాళ్ళంతా తంటామకుషులని ఆయన అభిప్రాయం. పదిహేనేళ్ళ క్రితం ఓసారి అనంతయ్యగారు చీకటి పడినాక సైకిలుకి లైటులేకుండా ఇంటికి వస్తుంటే ఓ కానిస్టేబుల్ చూసి స్టేషనుకి లాక్కెళ్ళాడు. ఆ రాత్రంతా ఆయన ఇంచుమించు కస్టడిలో వున్నట్లుగానే బయట వరండాలో జాగారాం చేశారు. ఆ కాసేపటిలోనే ఆయన అక్కడి మనుషుల తీరుతెన్నులు, తన లాటి ప్రాణులతో వాళ్ళు వ్యవహరించే పద్ధతులు చూసి హడలిపోయారు. ఈ జన్మలో పోలీసు స్టేషనుతోగానీ, పోలీసు మనుషులతోగానీ ఏ విధమయిన సంబంధబాంధవ్యాలు లేకుండా చెయ్యి తండ్రీ అంటూ వొట్లువేసుకుని దణ్ణాలు పెట్టుకొన్నారు. అలాటిది తను ఓ పోలీసు ఆఫీసరుతో, అందునా పనీపాటా లేక తీరుబడిగా కూర్చున్న మనిషితో వియ్యమందటమంటే వేరే వురిపోసుకోవాల్సిన పని ఉండదు !

'ఒరేయ్ సూరిగా' అంటూ ఓ కేక వేశారు. ఆయనకు కోపం వచ్చినపుడల్లా సురేష్‌ని అలాగే పిలుస్తూ వుంటారు.

సురేష్ బుద్ధిగా వచ్చి ఎదురుగా నిలబడ్డాడు, కొడుకుని చూడగానే సగం శాంతపడ్డారాయన.

'ఏటోయ్ ? ఏమిటి ? మీ అమ్మ ఏవిటి అంటోంది' అన్నారు బెట్లుగా.

'ఏవిటి నాన్నా? ఏంసంగతి?'మరింత అమాయకంగా అడిగాడు సురేష్.

'అదేనోయ్ అదే, ఏదో ఫోటో అదీ అంటోంది...ఏమిటి ప్రేమ వ్యవహారమా అన్నారాయన.

సురేష్‌కి బెరుగ్గానూ వుంది. నవ్వూ వస్తోంది. తనెంత డాక్టరయినా తండ్రి ఎదురుగా ప్రేమ, పెళ్ళి అంటూ మాట్లాలంటే కాస్త సిగ్గుగానూ అనిపించింది.

సురేష్ మౌనం చూసి "ఆ ఎవరి పిల్ల ? వంశం, కులం, గోత్రం చదువు ఏవిటని" అన్నారాయన సౌమ్యంగానే.

సురేష్‌కి బెరుకుపోయి ధైర్యం వచ్చింది. వివరాలన్నీ తండ్రికిచెప్పాడు. రంగారావుగారు రిటైర్డు పోలీసు ఆఫీసరు. రేణు మూడోపిల్ల. మరో ఇద్దరు పిల్లలున్నారు. బి.ఎ. పూర్తయింది. సురేష్‌కి ఏదో ఎగ్జిబిషన్‌లో పరిచయం అయింది. ఇద్దరూ ఒకరి కొకరు నచ్చారు. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారు. ఇంతే సంగతులు.

"మరి విశ్వేశ్వర్రావు వాళ్ళు పదిహేను వేల వరకు ఇస్తామన్నారు. వీళ్ళు ఇరవయ్యయినా ఇస్తారా లేదా ? మరి అమెరికా వెళ్ళబోయే డాక్టరు వూరికే దొరుకుతాడా ?" అన్నారాయన.

సురేష్ తలెత్తి తండ్రివైపు చూశాడు. "వాళ్ళు కట్నం ఇవ్వనూ ఇవ్వరు. ఇచ్చినా నేను తీసుకోదల్చుకోలేదు" అన్నాడు.

అనంతయ్యగారు ఏదో వింత విషయాన్ని విన్నట్టుగా కొడుకుని తేరిపార జూశారు. "అంటే నీ ఉద్దేశ్యం ? మనం ఏమన్నా కావాలని అడుగుతున్నామా? మంచి అల్లుడిని తెచ్చుకోవాలన్న ఆరాటంలో వాళ్ళే అన్నివేలిస్తాం, ఇన్ని వేలిస్తాం అని వస్తున్నారు. వద్దంటామా? చూడు సురేష్ నిన్నే పరిస్థితుల్లో ఏ విధంగా చదివించిందీ నీకు తెలుసు. నీ చెల్లెలికి పెళ్ళి చెయ్యాలి. నువ్వు కట్నం తీసుకోకపోయినా, నీ చెల్లెలికి ఇవ్వకుండా ఎవరయినా దొరుకుతారేమో చూడు. ఇంటిమీద పదివేల అప్పుంది. దానికి వడ్డీ కట్టటమే గగనమయిపోతోంది. నా ప్రావిడెంట్ ఫండ్ మీద కూడా లోన్ తీసుకున్నాను. ఇవన్నీ తీరే మార్గమేమిటని?"అన్నారు సౌమ్యంగానే.

'ఇవన్నీ నిజమే నాన్నా కానీ మనకున్న అప్పులన్నీ మరొకరి సొమ్ముతో తేర్చాలనుకోవటం అన్యాయం, అవమానకరం కూడానూ. మీరు వాటినిగురించి భయపడకండి. నేను అక్కడికి వెళ్ళిన తరువాత ఇవన్నీ మెలిమెల్లిగా తీర్చేద్దాం ఈ బాధ్యతంతా నామీద పెట్టండి నాన్నా. నా బాధ్యతలన్నీ తీరేవరకూ నా పెళ్ళి కూడా తలపెట్టవొద్దనే చెప్తున్నాను' సురేష్ తండ్రికి నచ్చచెప్పబోయాడు.

'పెళ్ళివద్దంటం కుదరదు. నువుదూర దేశానికి పోయేటప్పుడు మరో తోడు వుండటం అవసరం. నువు వంటరిగా పోయి ఏ దొరసాన్నో కట్టుకోవన్న నమ్మకం ఏమిటి?' అన్నారాయన కుండ పగలకొట్టినట్లుగా.

సురేష్‌కి నవ్వొచ్చింది, ఆయన భయాన్ని చూసి,మీకాభయంవద్దు నాన్నా! నేనక్కడికి వెళ్ళేది ఉద్యోగంలో మరింత పైకి వద్దామని గానీ, దొరసాన్ల వేట కోసరంకాదు" అన్నాడు

"నువ్వు వేటాడేదేమిటోయ్ ! వాళ్ళే నిన్ను వేటాడతారు" అంటూ తేల్చి పారేశారాయన.

సురేష్‌కినవ్వుతోపొలమారినట్లయింది. ఆయన తన పెళ్ళిచెయ్యకుండా తనని కదలనివ్వడు అన్నది రూఢిఅయింది.

"సరే మీ యిష్టం కానీ కట్నం తీసు

కునే పద్ధతి నాకు నచ్చదు. ఆ విధంగా అయితే నేను పెళ్ళిచేసుకోదల్చుకోలేదు' అన్నాడు.

అదే తన నిర్ణయం అన్నట్టుగా మాట్లాడుతున్న కొడుకుని ఓ క్షణం పరికించి చూశారు.

'నీ ఉద్దేశ్యం నీ కట్నం డబ్బుని బ్యాంకులోవేసి వడ్డీలమీద వడ్డీలు సంపాయిస్తాననుకుంటున్నావా? లేకపోతే ఆ డబ్బు పుచ్చుకుని నేనేమయినా జల్సాలు చేస్తాననుకుంటున్నావా? ఇంటిమీద అప్పు వెంటనే తీర్చకపోతే నెత్తిన ఈ మాత్రం నీడ కూడా వుండదు. కోతలుపోయి నా కిచ్చే జీతం ఇల్లు గడవటానికే సరిగా సరిపోతుందో లేదో నేను చెప్పలేను. మరి చెల్లెలు పెళ్ళి చెయ్యాలి. పెళ్ళి మాటల్తో అవుతుంది కానీ మాటల్తో కాదుగదా! మరిన్ని లంపటాలు నెత్తిన పెట్టుకొని కట్నం వద్దనటంలో అర్థమేమిటి? వాళ్ళంతట వాళ్ళు పదిహేను వేలు ఇస్తామని వస్తున్నారు. పుచ్చుకోవటంలో గల తప్పేమిటో నాకు అర్థంగావటంలేదు. కట్నంవద్దు, ఈ అప్పులన్నీ నేనే తీరుస్తానంటావా ? అదెప్పటికి? అప్పటివరకు అప్పిచ్చిన వాడు ఆగుతాడా? నీ చెల్లెలు అమ్మమ్మ అయ్యాక పెళ్ళి చేస్తావా? చెప్పు. ఇన్ని అప్పులు నెత్తిన వేసుకుని నువు జీవితంలో కాలుపెట్టడం మాత్రం శుభం అంటావా?చెప్పు. ఇదంతా నా కనవసరం అంటావా? నీ దోవన నీ ఇష్టప్రకారం వెళ్ళు. మా బాధలేవో మేం పడతాం' అంటూ అనంతయ్యగారు లేచి వంకెకున్న పాత ఖద్దరు లాల్చీ వేసుకొని బయటికి వెళ్ళిపోయారు.

తండ్రి లాల్చీ భుజంమీదనించి తొంగిచూస్తున్న చిరుగు, కొర్రుపట్టిన పంచె, అరిగిపోయిన చెప్పులు, ఆ బడుగు దేహం చూసి సురేష్‌కి కళ్ళలో నీళ్ళు నిండుకొచ్చాయి. ఆ మనిషి




రక్తం వోడ్చి శ్రమించకపోతే తనీనాడు ఈ హోదాలో వుండేవాడేనా? ఈ మనిషి శ్రమని, కష్టాన్ని, ఆప్యాయతనీ, అభిమానాన్ని మెట్లుగా చేసుకొనే తను అందుకోలేననుకున్న ఎత్తుల్ని అధిరోహించగలిగాడు. ఆ తండ్రి మనసుని అంతగా కష్టపెట్టుకొని మాట్లాడటం సురేష్‌కి గుండెల్లో గుచ్చినట్టుగా వుంది. తనో దోషిలా, కృతఘ్నుడిలా ఫీల్ అవసాగాడు. తండ్రిని సుఖపెట్టడానికి తనేం చెయ్యగలడు?

ఆలోచనలలో కొట్టుకుపోతున్న సురేష్ చెప్పులు చప్పుడవటంతో తలఎత్తి చూశాడు. రేఖ చేతిలో పుస్తకాలతో లోపలికి వచ్చింది. సాదా బట్టలతో, మెడలో రోల్డుగోల్డు చెయిను, చేతికి రంగు గాజులతో నిరాడంబర సుందరి లాగావుంది. ఖర్చుఎక్కువనికాలేజిమాని. ప్రైవేటుగా బి. ఎ. కి కడుతోంది. సురేష్‌ని చూస్తూనే కొంటెగా నవ్వి "రామయ్య పెళ్ళికొడు కాయెనే, మా అన్నయ్య పెళ్ళికొడు కాయెనే మా అన్నయ్య పెళ్ళికొడు కాయెనే" అంటూ లోపలికి వెళ్ళింది. సురేష్‌కి చెల్లెలిమీద ఒక్కసారిగా ప్రేమ పొంగుకొచ్చింది.

వీళ్ళకోసం, వీళ్ళందరి సుఖంకోసం తనేమయినా చెయ్యాల్సిందే! తండ్రిని సంతోషపెట్టాలి. రేఖకి చక్కటి భర్తని చూడాలి. వీళ్ళంతా తన వాళ్ళని నలుగురూ గర్వంగా, సగర్వంగా చెప్పుకోవాలి. సురేష్ మనసు ఓ నిశ్చయానికి వచ్చింది.

* * *

తమకి నచ్చిన పిల్లని సురేష్ కట్నంతో సహా పెళ్ళాడటానికి సిద్ధంగా ఉన్నాడని కమలమ్మ చెప్పిన మాటలు విని అనంతయ్యగారు కించిత్ ఆశ్చర్యపడ్డారు. కొడుకు ఇంత తేలిగ్గా తన మాట వింటాడని ఆయన ఊహించలేదు. ఆయన రేడియోల్లోనూ, పేపర్లలోనూ, పుస్తకాల్లోనూ వరకట్నం పుచ్చుకోవటం పాపం, అమానుషం, అక్రమం అంటూ పెట్టే గోలంతా విని, చదివి చూస్తూనే వున్నారు. ఖబుర్లకేం ఎన్నయినా చెబుతారు. తనదాకా వస్తేగానీ తెలియదని పెద్దలు వూరికే అన్నారా ?! ఏదీ రేఖని కానీ కట్నంలేకుండా ఏ బుద్ధిమంతుడయిన కుర్రాడయినా చేసుకుంటాడేమో చూడమను అనుకున్నారాయన. కొడుక్కి విద్యతో బాటు

వివేకం, వినయంకూడా వున్నాయని ఆయనకి తెలుసు. ఆయనకి ముఖ్యంగా ఆ పోలీసు సంబంధం తప్పిపోయి నందుకు బ్రహ్మానందంగా వుంది. వాళ్ళెలాగూ కట్నం ఇవ్వరని సురేష్ చెప్పాడు కాబట్టి ఇహ ఆ పిల్ల సంగతి ఆలోచించవలసిన అవసరంలేదు. ఆ ఆనందరావుకి, శేషయ్యగారికి, విశ్వేశ్వరావుకి కబురు చెయ్యాలి పిల్లల్ని చూడటానికి వస్తామని అనుకున్నా రాయన.

'నాన్నా ఎవరో వచ్చారు' అంటూ రేఖ లోపలికి వచ్చింది. అనంతయ్యగారు బయటగదిలోకి వచ్చారు. జరీ పంచె, గ్లాస్కో లాల్చీ. కండువాలతో వున్న ఇద్దరు నడివయస్సు మనుషులు వచ్చి నిలబడి నమస్కారం చేశారు.

'నమస్కారం, కూర్చోండి' అంటూ మర్యాదచేశారు అనంతయ్యగారు. వచ్చిన ఇద్దరూ తమని పరిచయం చేసుకొని, సూటిగా వ్యవహారంలోకి దిగారు.

'నా పేరు వీరభద్రరావండీ' ఇతను నా బావమరిది ఆంజనేయులు. మాది భీమవరం తాలూకా శంకరయ్యగారు మాకు బాగా పరిచయస్తులండీ, అన్నాడు. అక్కడక్కడ నెరసిన దుబ్బు తలతో మంచి హుందాగా వున్న వ్యక్తి

'శంకరయ్యగారు మీ సంబంధాన్ని గురించి చాలా ఘనంగా చెప్పారండీ. నాకు ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరబ్బాయిలూను. మా పెద్దమ్మాయి వసుంధర కోసమే మీ దగ్గరికి వచ్చాం. అమ్మాయి బి.ఎ. పాసయింది. ఇదుగో అమ్మాయి ఫోటో. ఇదిగో జాతకం. ఇరవై వేల వరకూ పెడదామనుకుంటున్నాం ఎట్టి పరిస్థితుల్లోనూ మీ సంబంధాన్ని వదులు కోవద్దని శంకరయ్యగారు చెప్పారు' అంటూ మర్యాదగా విన్నవించుకున్నాడు వీరభద్రంగారు.

'ఏదో శంకరానికి మేమంటే అభిమానం' అన్నారు అనంతయ్యగారు ఫోటోని, జాతకం కాగితాన్ని చేతిలోకి తీసుకుంటూ.

'మీకు ఎప్పుడు వీలవుతుందో చెప్పండి. పిల్లని చూసే ఏర్పాట్లుచేస్తాం' అన్నాడు వీరభద్రం.

అనంతయ్యగారు పిల్ల ఫోటోని చూశారు. 'గుండ్రటి మొహం, చేపల్లాటి కళ్ళు, గుండ్రటి బొట్టు' మొహంలో లక్ష్మీ కళ వొలుకుతోంది. ఆయనకి వెంటనే పిల్ల నచ్చింది.

'మా అన్నయ్యగారి అబ్బాయి, మా మేనమావగారి కొడుకు, మా బాబాయి కూతురు వీళ్ళంతా అమెరికా వెళ్ళి చాలా ఏళ్ళయిందండి. ఒకతను డాక్టరు, మరొకతను ఇంజనీరూను. మా వాళ్ళంతా కూడా మీ అబ్బాయికి అక్కడ సహాయంగా వుంటారు' అంటూ బావమరిది ఆంజనేయులు ఓమాట విసిరాడు, మీఅబ్బాయేగాడు అమెరికా వెళ్ళబోయేది మా వాళ్ళు వున్నారులెండి అన్నట్టుగా.

'మరో రెండు మూడు ఆఫర్లు పెండింగులో వున్నాయి. ఏదయినా అబ్బాయికి పిల్ల నచ్చటంగదా ముఖ్యం. రేపొకసారి కనిపించండి. అబ్బాయిని అడిగి ఏ విషయం తెలియచేస్తాను' అన్నారు అనంతయ్యగారు బెట్టుగా.

కాఫీ మర్యాదలయ్యాక వాళ్ళు మరోసారి శలవు పుచ్చుకుని నమస్కరించి వెళ్ళిపోయారు.

లోపలి గదిలోంచి ఆత్రంగా వింటున్న కమలమ్మగారు బయటకి వచ్చి, భర్తచేతిలోని ఫోటోని చూసి, 'పిల్ల చాలా బాగుందండి. పైగా ఇరవై వేలు ఇస్తామంటున్నారు. ఆ ఇస్తారు. ఎందుకివ్వరు ? ! మనవాడిలాటి రాజా సంబంధం దొరకొద్దూ. నలభై వేలయినా ఇస్తారు' అంటూ మురిసిపోయింది.

* * *

నిద్ర బద్ధకంతో పడుకున్న సురేష్ని కుదిపికుదిపి లేపింది 'అయ్యా, డాక్టరు గారూ. తమరి పవిత్ర చరణ సన్నిధిని చేరుకోవటానికి తపస్సు చేస్తూ పోటీ పడుతున్న ఈ లలనా మణుల్ని ఓసారి తిలకించండి సార్" అంటూ రేఖ నాలుగు ఫోటోల్ని సురేష్ కళ్ళ ఎదురుగా పేకముక్కల్ని అమర్చినట్టుగా పట్టుకొంది.

"ఏయ్ మొద్దమ్మాయ్ ! అల్లరి చెయ్యక నన్ను పడుకోనీ" అంటూ ముసుగు మరింతగా బిగించాడు సురేష్.


"ఎంత అన్యాయం! ఎంత ఘోరం! పాపం స్వయంవర మాల పుచ్చుకుని ఎదురుచూస్తున్న ఈ రాజకుమార్తెల స్వప్నసుందరుడు ఇలా జిడ్డుగా,ముసుగు బిగించి మత్తు మందు ఖాయీలాగా పడుకోవటం ఎంత పాపం!' రేఖ ముసుగులాగి లేపి కూర్చోబెట్టి ఒక్కొక్క ఫోటోయే చేతికిచ్చింది. సురేష్ మూడు ఫోటోల్ని వివిధ కోణాల్లోంచి పరికించి చూసి, నాలుక చప్పరించి పక్కన పడేశాడు. నాలుగో ఫోటోని దీక్షగా, పరిశీలనగా కళ్ళు చిట్లించి చూస్తున్న సురేష్ని చూసి రేఖ నవ్వింది.

సురేష్ ఆ ఫోటోలోని గుండ్రటి మొహాన్ని, కమలరేకుల్లాటి ఆ కళ్ళనీ, చిన్న సున్నాచుట్టినట్టున్న ఆ మూతినీ ముగ్ధుడయినట్టుగా చూస్తూవుంటే రేఖ చటుక్కున ఆ ఫోటో లాక్కొని, 'నాన్నా అమ్మా కూడా ఈ మహంకాళినే సెలక్ట్చేశారే ! ఏం వుద్ధబ్బా ఈ పిల్ల మొహంలో ?' అంటూ ఓ క్షణం కొంటెగా ఫోటోని పరీక్షించి, 'ఏం చేస్తాం కానీ. ఈవిడెలాటి సూర్యకాంతమ్మో! వ్ మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అన్నారిందుకే' అంటూ రెడీగా వుండు 'రేపే తమరి స్వప్న సుందరిని దర్శించే పవిత్ర దినం' అంటూ బయటికి పరుగెత్తింది రేఖ.

పెళ్ళిచూపులు సకల మర్యాదలతో పూర్తయ్యాయి. కుందనం బొమ్మలాగ వుంది పిల్ల. మొహంలో లక్ష్మికళ వుట్టిపడుతోంది అనుకుంది కమలమ్మ గారు. నిండుగా పమిట కప్పుకుని, కాస్తంత తలవంచి కూర్చున్న పిల్లని చూసి వినయవంతురాలే అనుకున్నారు అనంతయ్యగారు. దృష్టితిప్పుకోలేనట్లుగా ఆ పిల్లనే చూస్తున్న సురేష్ అంగీ కారాన్ని వేరే అడిగే పనేలేకపోయింది.

వీరభద్రంగారు, ఆంజనేయులుగారు బహు మర్యాదలు చేశారు. అనంతయ్య గారిని ఇల్లు, దొడ్డీ తిప్పి చూపించారు. ఇంటినీ, ఇంటి వైభవాన్ని చూసి సంతోషపడ్డారాయన. వీరభద్రంగారి కొడుకుని చూసినప్పుడు మాత్రం చేదు మాత్రతిన్నట్టు అయిం దాయనమొహం. 'వీడేనండీ మా అబ్బాయి శేఖర్' అంటూ పరిచయం చేశారు. వీరభద్రం గారు శేఖర్ ఎత్తుగా పొడుగ్గా జులపాల జుట్టుతో, మొహం సగంవరకు మూసుకు పోయిన చెంపల్ని, గళ్ళ గళ్ళ చొక్కా, పరికిణీలాంటి పేంటుతో ఓ ఆరితేరిన రౌడీలాగా కనిపించాడాయన కళ్ళకి. ఆ కుర్రాడి కోరచూపులు మరింత భయపెట్టాయి ఆయన్ని. 'ఛా ఛా ఏంకాలమో ఏం పిల్లలో వెధవ ఫేషన్లు' అనుకున్నారాయన.

సురేష్ బండి ఎక్కుతుండే శేఖర్ వచ్చాడు. 'బావగారూ అమెరికా డాక్టరు గారికి ఇరవై వేలు చాలా తక్కువ రేటండీ. నేనైతే నలభై వేలు డిమాండ్ చేసేవాడిని' అన్నాడు వోరగా చూస్తూ. వీరభద్రంగారు వారిస్తున్నట్టుగా శేఖర్ వైపు చూశారు. అతనా చూపుని లక్ష్యపెట్టనట్టుగా నిర్లక్ష్యంగా లోపలికి వెళ్ళిపోయాడు. సురేష్ నవ్వలేక నవ్వి నట్లుగా నవ్వాడు. అనంతయ్యగారికి ఆ మాటలు ఏవో అపశకునంలా ధ్వనిం చాయి.




'అన్నయ్యా ఆ పిల్ల పేరు వసుంధ రట. ఇంకా నయం మందర అని పెట్టు కుందిగాదు' అంటూ నవ్వించింది అన్నగారిని రేఖ.

'మందరో, వసుంధరోగానీ ఆ కుర్రాడు మాత్రం అచ్చు రావణా సూరుడల్లేవున్నాడు' అంది కమలమ్మ గారు.

'వూరుకోమా. అతన్నేం అనకు. అన్నయ్యక్కాబోయే బావమరిది గదూ! పాపం కోపం వస్తుంది,' అంటూ వుడికించింది రేఖ.

సురేష్ వసుంధరల వివాహం ఖాయ మయింది. లగ్నాలుపెట్టి కబురుచేస్తాం అన్నారు వీరభద్రంగారు. అదే సమ యాన వరకట్నం కూడా ముందరగానే ముట్టచెపుతాం అని తెలియచేశారు. 'అలాగే' నంటూ అంగీకారాన్ని తెలిపారు అనంతయ్యగారు.

దశమి, సోమవారం బాగుందని లగ్నపత్రికను తీసుకువచ్చారువీరభద్రం గారు, బావమరిదీనూ, అనంతయ్య గారు, సురేష్, కమలమ్మగారు ఆ ముహూర్తానికి తమ అనుమతిని తెల్పారు. వీరభద్రంగారు జిప్‌బ్యాగ్ తెరచి అందులో కట్టలుగా కట్టివున్న నోట్ల దొంతరని ఒక్కొక్కటే తీసి పళ్ళెంలో వుంచసాగారు. బయట ఏదో కారు ఆగిన సందడి అయింది. మరు క్షణం వీరభద్రంగారి కొడుకు శేఖర్, గ్లాస్కో పంచె, లాల్చీ ధరించిన మరో పెద్దమనిషి లోపలికి వచ్చారు.

"నాన్నా వీరు చంద్రశేఖరంగారని నాకు తెలిసిన పెద్దమనిషి. ఈ సందర్భంలో మరో పెద్దమనిషి కూడా వుండటం మంచిదని తీసుకొచ్చాను," అన్నాడు శేఖర్ నవ్వుతూ. వీరభద్రం గారు నొసలు చిట్లించి కోపంగా చూశారు శేఖర్‌వైపు. ఈ సమయంలో చంద్రశేఖరంగారి రాక ఏమాత్రమూ ఇష్టమున్నట్టు లేదాయనకి. అయినా వచ్చిన పెద్దమనిషిని బయటకి పొమ్మనటం సభ్యతకాదు గనుక మౌనం వహించారు.

నోట్ల కట్టలు అమర్చిన పళ్ళేన్ని అనంతయ్యగారికి అందిస్తూ,' బావగారూ ఇదిగో మా అమ్మాయి వివాహ సందర్భంలో వరకట్నంగా మే మిచ్చు కుంటాం అన్న ఇరవై వేల రూపాయలు. జాగ్రత్తచెయ్యండి'అన్నారు.అనంతయ్య గారు సంతోషంగా పళ్ళేన్ని అందుకుని లేవబోయారు. అంతవరకు మౌనంగా కుర్చీలో కూర్చున్న చంద్రశేఖరం చటుక్కునలేచి నిలబడ్డాడు. "వీరభద్రం

గారూ ! మిమ్మల్నిద్దరినీ ప్రభుత్వ చట్ట వ్యతిరేక నేరంమీద ప్రభుత్వ అధికారిగా అరెస్ట్ చేస్తున్నాను. వరకట్నం ఇవట్వం, పుచ్చుకోవటం కూడా నేరం అన్న సంగతి మీకు తెల్సనుకుంటాను. అన్నాడాయన గంభీరంగా.

ఈ హఠాత్సంఘటనకి ఎక్కడి వారక్కడే చేష్టలు దక్కి నిలబడి పోయారు. సూదిపడితే వినిపించేంత నిశ్శబ్దం అలుముకుంది ఓ క్షణం. ముందుగా వీరభద్రంగారే తేరుకున్నారు.

'ఏమిటి మీరనేది? అసలు మీరెవరూ?' ఎండిపోతున్న గొంతుని అదుపులోకి తెచ్చుకుంటూ అన్నారాయన. తెల్లగా పాలిపోయిన వీరభద్రంగారి మొహం చూసి అనంతయ్యగారి కాళ్ళు గడగడ వొణకసాగాయి.

వీరభద్రంగారి ప్రశ్నకి జవాబు శేఖర్ చెప్పాడు. "నాన్నా, ఆయనెవరో నేను చెపుతాను విను. ఆయన చంద్రశేఖరంగారని మఫ్టీలోవున్న పోలీసు ఆఫీసరు. నేనే వారికి రిపోర్టు చేశాను. ఈ మహానుభావుడికి ఇరవై వేల కట్నం కావాల్సి వచ్చిందట ఓ ఆడపిల్లని పెళ్ళాడటానికి' హేళనగా అంటూ, వోరగా చూశాడు సురేష్‌వైపు. సురేష్ ఏం చెయ్యాలో దిక్కుతోచనివాడిలా అందరినీ మార్చి మార్చి చూస్తున్నాడు.

'ఓరి వెధవా, ఎంతపని చేశావురా ? శుభమా అంటూ చేస్తున్న చెల్లెలి పెళ్ళి చెడగొట్టటానికి నీకు నోరెలా వచ్చిందిరా దౌర్భాగ్యుడా? ఈ జన్మలో దానికి పెళ్ళవుతోందిరా? నా కడుపున ఇంతటి దుర్మార్గుడివి పుడతావనుకోలేదురా వెధవా?"' అంటూ వీరభద్రంగారు విరుచుకుపడ్డారు కొడుకుమీద.

'అయ్యా ఇప్పుడు ఎవడుమాత్రం ఆవేశపడి చేసేదేంలేదు. మీరంతా శాంతంగా ప్రభుత్వానికి సహకరించాలని కోరుతున్నాను.' అంటూ రెండుచేతులోనూ గట్టిగా చప్పట్లు చరిచారు చంద్రశేఖరంగారు. బూట్లు టకటకలాడిస్తూ, ఇద్దరు కానిస్టేబుల్స్ లోపలికి వచ్చి చెరోవైపున నిలబడిపోయారు. అనంతయ్యగారు, వీరభద్రంగారు నిల్చున్నచోటనే కూలబడిపోయారు.

చంద్రశేఖరంగారు సురేష్ వైపు తిరిగాడు. 'చూడండి మిస్టర్ సురేష్ ఇటువంటి దురాచారాన్ని రూపుమాపవలసిన మీలాటి చదువుకున్న యువకులే ఈ దురాచారాన్ని ప్రోత్సహిస్తున్నారంటే ఐయ్ మస్ట్ ఫీల్ ఎషేమ్డ్ ఆఫ్ ఇట్. ప్రగతికి దోవచూపించవలసిన మీలాటి విద్యావంతులు పురాతన యుగంనాటి ఈ మూఢాచారాన్నే అనుసరిస్తున్నారంటే రియల్లీ అది మనదేశ దురదృష్టం. ఎన్ని కుటుంబాలు, ఎంతమంది ఆడపిల్లలు ఈ వరకట్న పిశాచ కోరల్లో ఇరుక్కుని నాశనమయ్యారో ఎప్పుడయిన ఆలోచించారా? పెద్దలకి నచ్చచెప్పి ముందుకు రావాల్సిన మీలాటి యువకులే ఇలా చేస్తున్నారంటే రియల్లీ ఆయామ్ ఏ షేమ్‌డే ఆఫ్ అవర్ ఎడ్యుకేషన్ ఆఫ్ అవర్ యూత్' అన్నారాయన నిం పూర్వకంగా సురేష్‌వైపు చూస్తూ. దోషిలా తలవంచుకున్న సురేష్‌ని చూసి అనంతయ్యగారి ప్రాణాలు గిలగిల లాడుతున్నాయి. తనేగదూ వాడి మెడలు వంచి కట్నం కట్నం అంటూ కూర్చుంది. ఇప్పుడు ఈ అవమానాన్నుంచి బయటపడేదెట్లా ? వీళ్ళు తీసుకుపోయి జైల్లో ఎన్నాళ్ళు కూర్చోపెడతారో ఏమో! తన బుద్ధితక్కువతనంతో, దురాశతో, బంగారంలాటి కొడుకు భవిష్యత్తుకి కూడా మచ్చతెచ్చాడు. ఎలా? ఏం చెయ్యాలి? అలా రెడ్‌హేండెడ్‌గా పట్టుబడేసరికి ఎవరికీ మరో మాట మాట్లాడే అవకాశంగూడా లేనట్లుగా నిస్సహాయంగా కూర్చుని, ఈ ఉపద్రవానికి అంతకీ కారకుడయిన శేఖర్‌ని నమిలి మింగేట్టుగా చూడసాగారు.

సురేష్‌కి ఏదో ఐడియా తట్టినట్టుగా చటుక్కున తండ్రివైపు తిరిగాడు. 'నాన్నా' రంగారావుగా రొక్కరే ఈ పరిస్థితుల్లోంచి తప్పించగలరు. నేనొక్కసారి ఆయన్ని కలుసుకువస్తాను. అన్నాడు మెల్లగా తండ్రితో. అనంతయ్యగారి కళ్ళలో ఆశారేఖమెరిసింది. నడిసముద్రంలో మునిగిపోతున్న వాడికి గడ్డిపరక దొరికినట్టుగా వుంది.

చంద్రశేఖరంగారు కుర్చీలో కూర్చుని, వివరాలన్నీ రాసుకోసాగారు. సురేష్ మెల్లగా బయటికి వెళ్ళాడు. ఓ అరగంట గడిచింది. చంద్రశేఖరంగారు నోట్ల కట్టల్ని సంచిలోవేసి మూటకట్టి సీల్‌చేయిస్తున్నారు.

సురేష్ రంగారావుగారితో తిరిగి వచ్చాడు. రంగారావుగారు మంచి వొడ్డూ పొడుగూతో, బారెడు మీసాలతో, యూనిఫారమ్‌తో లేకపోయినా పోలీసు ఆఫీసరుగానే వున్నారు.

ఆయన వస్తూనే 'హలో చంద్రం' అంటూ వచ్చారు. ఆయన్ని చూస్తూనే చంద్రశేఖరం లేచి సెల్యూట్ చేస్తూ, 'అరే సార్, మీరు ఇక్కడ కెలా వచ్చారు?' అన్నాడు ఆశ్చర్యంగా. రంగారావుగారు, చంద్రశేఖరం బయట జీపుదగ్గర నిలబడి ఓ పది నిముషాలు మాట్లాడుకున్నారు.

చంద్రశేఖరం లోపలికి వచ్చి వీరభద్రంగారిని, బావమరిదిని, శేఖర్‌ని, నోట్లకట్టల్ని వెంటబెట్టుకుని జీపులో వెళ్ళిపోయాడు.

అనంతయ్యగారికి ఆ సమయంలో రంగారావుగారిని చూస్తుంటే సాక్షాత్తూ ఆ ఏడుకొండలవాడే దిగివచ్చి, చక్రం అడ్డువేసి తన్నా జైలు నరకంనుంచి తప్పించాడనిపించసాగింది.

'అయ్యా రంగారావుగారూ మీ మేలు జన్మ జన్మలకి మరచిపోను' అన్నా రాయన కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ రంగారావుగారి చేతులు పుచ్చుకుని. రంగారావుగారు మీసం మెలివేసి నవ్వ నట్టుగా నవ్వారు 'అవునూ, సురేష్ మా రేణుద్వారా నాకు బాగా తెలుసండీ. ఇదివర కెప్పుడూ ఈ కట్నం గిట్నం తీసుకోవటం మహా అపరాధం అంటూ వాదించేవాడు. ఇంతలో ఇలా ఎట్లా మారి పోయాడో తెలియకుండా వుంది. వాటీజ్ ద మేటర్ మై డియర్ బాయ్' అన్నారాయన సురేష్ భుజంమీద చెయివేస్తూ.


సురేష్ తండ్రివైపు చూసి ఏం చెప్పలేనట్లుగాతలవంచుకున్నాడు. 'ఎక్స్ క్యూజుమి సర్. నాదే ఈ పొరపాటంతా' అన్నాడు మెల్లగా. తన తప్పుని నెత్తి మీద వేసుకుంటున్న కొడుకుని చూసి అనంతయ్యగారి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తన మూర్ఖత్వంతో మచ్చ పడబోయిన కొడుకు భవిష్యత్ జీవితాన్ని, చివరి క్షణంలో ఆయన కాపాడిన వైనాన్ని తల్చుకుంటే ఆ పోలీసుజాతి మనిషిమీద చెప్పలేనంత భక్తీ, గౌరవం, అభిమానం అన్నీ కలగలిసి మనసుని నింపాయి.

రంగారావుగారు అనంతయ్యగారి అతిథి మర్యాదల్ని సుష్టుగా అనుభవించి నువు కనిపించడంలేదని రేణు అనుకుం టుందోయ్. మీ అమ్మగారిని, నాన్న గారిని కూడా ఓ సారి తీసుకురా' అన్నారాయన వెళ్ళబోతూ.

ఆయన వెళ్ళగానే తప్పిపోయిన గండాన్ని తలుచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది కమలమ్మ. భయంతో గడ్డ కట్టుకుపోయిన రేఖ మొహంలోకి కాస్తంత కళ వచ్చింది.

* * *

రేణు, సురేష్‌ల వివాహం నిశ్చయ మయింది. వీరభద్రంగారు రెండుసార్లు



కబురు పంపారు. ఎలాగయినాసరే తమ పిల్లని చేసుకోవాల్సిందిగా. అగ్గిమీద గుగ్గిలంలా ఎగిరిపడ్డారు అనంతయ్యగారు. ఇంకా ఏ మొహం పెట్టుకొని సంబంధం కలుపుకోవా లనుకుంటున్నారు? అంటూ చెల్లెలికి కాబోయే భర్తనయినా లేకుండా పోలీసు రిపోర్టిస్తాడా ఆ శేఖర్‌గాడు. అమ్మ రౌడీ వెధవానీ. సమయానికి రంగారావుగా రడ్డుపడబట్టిగానీ, తనూ, తన కొడుకూ జైల్లో వుండవలసినవాళ్ళు గదూ ! బంగారంలాటి కొడుకు భవిష్యత్తుని నాశనం చేసినవాడయ్యేవాడు గదూ తాను. నగుబాట్ల పాలవ్వవలసిన తమ బ్రతుకు క్షణంలో ఎలా తప్పిపోయిందో తల్చుకుంటే ఆయనకి గుండె చెరువైపోతూ వుంటుంది.

సురేష్ ఎన్నుకున్న రేణు అందాల బొమ్మలావుందని అందరూ అంగీకరించారు.

'బావగారూ వరకట్నం....' అంటూ రంగారావుగారు అన్నప్పుడు ఆయన కళ్ళలోని కొంటెదనాన్ని గ్రహించలేని అనంతయ్యగారు 'వద్దుబావగారూ కట్నం మాట ఎత్తకండి. మీ పిల్లే మాకుకట్నం' అన్నప్పుడు రంగారావుగారు మీసాల చాటున ముసిముసిగా నవ్వుకున్నారు.

'మరి మీకేవో అప్పులూ అవీ వున్నాయన్నాడు సురేష్' అన్నారాయన. అవును వున్నాయి. సురేష్ నేనూ కలిసి వాటిని మెల్లగా తీర్చేస్తాం. మీరు ఓ సహాయం చెయ్యాలి. మీ ఎరుకలో కట్నం తీసుకోని ఓ బుద్ధిమంతుడయిన కుర్రాడిని మాత్రం మా రేఖకోసం చూసిపెట్టాలి' అన్నారు అనంతయ్యగారు.

'షూర్ షూర్' మా రేణు నిజంగా చాలా అదృష్టవంతురాలండీ' అన్నారాయన.

'రేణూయే కాదండీ మేవూనూ' అన్నారు అనంతయ్యగారు చిరునవ్వుతో.

వైభవంగా రేణు సురేష్‌ల వివాహం జరిగింది. కానీ అనంతయ్యగారికి ఆ పెళ్ళిలో తిరిగిన కొంతమంది మనుషులు తనకి బాగా పరిచయం అయిన మొహాల్లాగా కనిపించసాగారు.

అరె ఈయనెవరో అచ్చు వీరభద్రం లాగే ఉన్నాడే! మరి వీరభద్రానికి నెరిసిన మబ్బులాటి జుట్టు వుండేది. పైగా నడివయసువాడు. మరిమనిషికేమో తలమీద నాలుగు పరకలు కూడా వున్నట్టులేవు. చిన్నవాడుకూడాను. ఆ పిల్లని అదాటుగా చూస్తే వీరభద్రం కూతురు వసుంధరలాగానే వుంది. కానీ ఎలా కుదురుతుంది. ఈ పిల్లేవిటో షర్టు పేంటు వేసుకుని, పొట్టిజుట్టు విరగబోసుకుని ఒకటే నవ్వులూ పరుగులూనూ. ఆ వసుంధర ఎంత చక్కగా పొడవాటి జడ వేసుకుని, గుండ్రటి బొట్టు పెట్టుకొని, పవిట నిండుగా కప్పుకుని లక్ష్మీదేవిలాగా వుందిగదూ. ప్చ్ ఇద్దరికీ సాపత్యం ఎక్కడ ! తన భ్రమగానీ వయసులోవున్న ఆడపిల్లల ముఖాలన్నీ ఒక్కలాగే కనిపిస్తాయట్లే వుందేం !

తలుపు దగ్గర నిలబడ్డ ఆ టెంకాయ మొహాన్ని ఎక్కడో చూసినట్టే వుండి గుర్తురావటంలా.

'బావగారు ఎక్కడున్నారూ,' అంటూ రంగారావుగారు ఓ కుర్రాడిని వెంటబెట్టుకు వచ్చారు. 'ఇతను వరసకి మా అక్క కొడుకు అవుతాడండీ. సురేష్‌కి కూడా ఫ్రెండే. ఈ వూళ్ళోనే ఎల్.ఐ.సీ. లో పనిచేస్తున్నాడు. బుద్ధిమంతుడే కానీ కాస్త కొంటెపిల్లాడు. కట్నం తీసుకోనని శపథం చేశాట్ట. పెళ్ళికొడుకుల లిస్టులో మొదటిఛాన్సు మనవాడి కివ్వచ్చండి' అన్నారాయన.

అనంతయ్యగారు ఆయన చెప్పేది వినకుండా ఆ కుర్రాడిని పరీక్షగా చూస్తున్నారు. ఈ అబ్బాయి...ఇతను ...ఆ రౌడీ శేఖర్‌లాగే వున్నాడేం, ఉహుం ఆ శేఖర్‌గాడి జులపాల జుట్టు, ఆ చెంపలు, ఆ రౌడీ డ్రస్సు, వోర చూపులు...ప్చ్ ప్చ్...ఈ కుర్రాడు నిక్షేపంలాగా వున్నాడు. ఏవిటయిందివాళా నాకు. ఎవర్ని చూసినా ఎక్కడో చూశాననుకుంటున్నాడేం ఖర్మ. తన మతిగాని చెదరటం లేదుగదా !

'నీ పేరేవిటోయ్? శేఖరా !' అన్నారాయన అనుమానంగా చూస్తూ.

'కాదండీ మాధవరావు' అన్నాడా కుర్రాడు సౌమ్యంగా నవ్వుతూ. మళ్ళీ తనదే పొరపాటు. కాస్త మాధీఫలరసాయనమో, నిమ్మకాయ నీళ్ళో తాగాల్సిందే అనుకున్నారాయన.

'రా ఇలా కూర్చో' అంటూ పక్కన కూర్చోబెట్టుకొని ఆ కుర్రాడి వివరాలన్నీ కనుక్కున్నారు. అన్నీ విన్న తరువాత ఈ కుర్రాడు రేఖకి జోడీగా చాలా బాగా వుంటాడు అనుకోసాగారు.

ఆ రాత్రి సురేష్‌రేణులు హోటల్లో తమ స్నేహితులైన 'అజంతా ఆర్ట్స్ నాటక సమాజం' వారికి విందు చేశారు. 'థ్యాంక్యూ ఫ్రెండ్స్. మీ అందరి సహాయానికి మా దంపతుల హృదయపూర్వక కృతజ్ఞతలు' అంటూ చేతులు జోడించారు దంపతులిద్దరూ. 'మరో శుభవార్త ఈ మాధవరావ్ ఉరఫ్ శేఖర్‌కి, మా చెల్లెలయిన రేఖాదేవికి త్వరలో జరగబోవు వివాహ మహోత్సవానికి మీరంతా సకుటుంబ సపరివార సమేతంగా వేంచేసి మదర్పిత చందన ......... 'అంటూ వుండగానే సభ్యులంతా గొల్లున లేచి మాధవరావుని చుట్టుముట్టారు. 'ఒరేయ్ సురేష్ బాబూ, వట్టి థ్యాంక్స్‌తో సరిపెడితే కుదర్దోయ్. అక్కడికి వెళ్ళాక మాకేవయినా హాలీవుడ్ ఛాన్సు దొరుకుతుందేమో ట్రై చెయ్ !' అంటూ ఓ కంఠం ఆరంభించింది.

"మరీ పుట్టికెక్క లేనమ్మ స్వర్గానికి ఎక్కుతా నందట మరో కంఠం నవ్వుల్లో హోటల్ రేడియో పాట మధురంగా వినిపించసాగింది, పెళ్ళయిందీ ప్రేమ విందుకు వేళయిందీ" అంటూ.

---